ఉపాధ్యాయులే సమాజ నిర్మాతలు

– డీఆర్వో విశ్వేశ్వరనాయుడు

కడప సెవెన్‌రోడ్స్ : విద్యార్థుల ప్రగతికి బాటలు వేసేందుకు కృషి చేసేవారే ఉపాధ్యాయులని డీఆర్వో విశ్వేశ్వరనాయుడు అన్నారు. కడప ఆఫీసర్స్ క్లబ్‌లో స్విమ్మింగ్, టేబుల్ టెన్నిస్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అనంతరం పలువురు ఉపాధ్యాయులను డీఆర్వో ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కడప ఆర్డీఓ జాన్ ఇర్విన్, జానమద్ది విజయభాస్కర్, లేవాకు మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.



సత్కారాలు అందుకున్న ఉపాధ్యాయులతో డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, తదితరులు

మానవత ఆధ్వర్యంలో..

మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం నాగార్జున మహిళా డిగ్రీ కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. 13 మంది అధ్యాపకులు, ఉపాధ్యాయులను పురస్కారాలతో సత్కరించారు. వైవీయూ రిటైర్డ్ ప్రొఫెసర్ జి.సాంబశివారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మానవత సెంట్రల్ కమిటీ డైరెక్టర్ డాక్టర్ అవటాల రామాంజులరెడ్డి, వ్యవస్థాపకులు ఎన్.రామచంద్రారెడ్డి, రాటాల గోపి, పుట్టా సుబ్రమణ్యం, పబ్లిక్ కమిటీ చైర్మన్ సుబ్బారాయుడు, డాక్టర్ పెద్దిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జేవీవీ ఆధ్వర్యంలో..

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు అందుకున్న గురువులకు శుక్రవారం జన విజ్ఞాన వేదిక జిల్లా కమిటీ అభినందనలు తెలియజేసింది. ఈ కార్యక్రమంలో జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి శివరాం, అధ్యక్షులు సమీర్ బాష, నగర కమిటీ ప్రధాన కార్యదర్శి నరసింహారెడ్డి, గౌరవ సలహాదారు పిల్లా కుమారస్వామి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రగతి నిర్దేశకులు ఉపాధ్యాయులు

కడప ఎడ్యుకేషన్: ఉపాధ్యాయులే సమాజ నిర్మాతలని పెన్షనర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామ్మూర్తి నాయుడు, వర్కింగ్ ప్రెసిడెంట్ నాగముని రెడ్డి అన్నారు. శుక్రవారం కడపలోని పెన్షనర్ల సంఘ కార్యాలయంలో పెన్షనర్ల నాయకత్వంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి, గురుపూజోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గానుగపెంట హనుమంతరావు, తుపాకుల నారాయణ, యమ్మనూరు వెంకటయ్య, రాధాకృష్ణ, పార్వతమ్మ, చెంచిరెడ్డి తదితరులు ఉపాధ్యాయ దినోత్సవ ప్రాశస్త్యం గురించి వివరించారు. అనంతరం ఉపాధ్యాయ వృత్తిలో పనిచేసి రిటైర్ అయి నేటికీ వివిధ సామాజిక కార్యక్రమాల్లో పాల్గొంటున్న ఉపాధ్యాయులను సన్మానించారు. రిటైర్డ్ పంచాయతీ అధికారి నాగరత్నాచారి వందన సమర్పణ చేశారు.

– సర్వేపల్లి సేవలు స్ఫూర్తిదాయకం అని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ యంవీ రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. కడప అక్కాయపల్లిలోని సాయిబాబా విద్యాసంస్థల్లో శుక్రవారం ఉపాధ్యాయ దినత్సోవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ శ్రీదేవి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి సమాజానికి ఉపయోగపడేలా తయారు చేసే బాధ్యత గురువులదేనన్నారు. గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని పదవీ విరమణ డిప్యూటీ ఈఓ జిలానీబాషను సన్మానించారు.

పవన్ కాన్సెప్ట్ స్కూల్లో...

కడప అక్కాయపల్లె శాస్త్రినగర్‌లోని పవన్ కాన్సెప్ట్ స్కూల్లో ఉపాధ్యాయ దినత్సోవాన్ని నిర్వహించారు. స్కూల్ కరస్పాండెంట్ లెక్కల జోగిరామిరెడ్డి , ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పీఎం శ్రీ కేవీలో ..

పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులందరూ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గురుపూజోత్సవం సందర్భంగా వచ్చే ఏడాది పదవీ విరమణ చేయనున్న సీనియర్ ఇంగ్లీష్ పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్ పద్మజా రాణిని సత్కరించారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయుల పాత్రను పోషించగా, ఉపాధ్యాయులు విద్యార్థుల మాదిరిగా అసెంబ్లీ నిర్వహించారు. అనంతరం 11, 12 తరగతుల విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కొంతమంది విద్యార్థులు పాటలు పాడగా, ప్రాథమిక తరగతుల విద్యార్థులు ఉపాధ్యాయుల గొప్పతనంపై స్కిట్ ప్రదర్శించారు. కార్యక్రమం అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులు అందరూ కలిసి కేక్ కట్ చేసి ఉత్సాహంగా జరుపుకున్నారు. చివరగా విద్యాలయ ప్రిన్సిపాల్ మునేష్ మీనా ఉపాధ్యాయ దినోత్సవంపై ప్రసంగించారు.

గురువులకు అభినందనలు

విద్యారంగంలో అంకితభావంతో పని చేస్తూ, విద్యార్థుల్లో జ్ఞానార్జన తపనను, సామాజిక చైతన్యాన్ని పెంపొందించిన ఉత్తమ ఉపాధ్యాయులకు జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి శివరాం, అధ్యక్షులు సమీర్ బాష, నగర కమిటీ ప్రధాన కార్యదర్శి నరసింహారెడ్డి , జనవిజ్ఞాన వేదిక గౌరవ సలహాదారులు పిల్లా కుమారస్వామిరెడ్డిలు అభినందనలు తెలిపారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను అందుకున్న గురువులను జేవీవీ తరుపున సన్మానించారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా కమిటీ పక్షాన జన విజ్ఞాన వేదిక నాయకులు ఉపాధ్యాయుడు షేక్ ఖాసింవల్లికి, యుటీఎఫ్ నాయకులు గోపీనాథ్‌కు, జన విజ్ఞాన వేదిక బద్వేల్ మండల అధ్యక్షులు శివప్రసాద్‌కు, బి కోడూరు మండలం మేకవారిపల్లె జిల్లా పరిషత్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు తులసి రామకృష్ణ, స్కౌట్ మాస్టర్ వెంకటసుబ్బయ్య, భాకరపేట హై స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీ కేసమ్మ సన్మానించారు.

తరగతి గది సవాళ్లు అధిగమించాలి

కడప సెవెన్‌రోడ్స్ : ఉపాధ్యాయులు తరగతి గది సవాళ్లు అధిగమించాలని ఒంటిమిట్ట మండల విద్యాధికారి డాక్టర్ వల్లూరు బ్రహ్మయ్య అన్నారు. పోతుల చిన్న ఓబుల్‌రెడ్డి, కంచమ్మ, సరస్వతమ్మ ఛారిటబుల్ ట్రస్టు, రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ సంయుక్తాధ్వర్యంలో శుక్రవారం నగరంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆర్‌టీసీఎస్ ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్దన్‌రాజు అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో బ్రహ్మయ్య ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో విశిష్ఠ సేవలు అందిస్తున్న వివిధ మండలాలకు చెందిన ఉపాధ్యాయులు థేరేసమ్మ, సుశీల, సుజాత, మమత, జీవీ సాయిప్రసాద్, సుందర్‌రాజు, మధుసూదన్, శ్యాంసుందర్, వెంకట సుబ్బయ్య, కేశవరెడ్డి, శ్రీనివాసులు, నరసింహామూర్తి, శివప్రసాద్, వెంకట నాయుడు, రాజేంద్రలతోపాటు పాత రిమ్స్ వైద్యులు సుమధుర, పర్యాటక ఫోటోగ్రాఫర్ గొబ్బూరి కోటేశ్వరరావులను సన్మానించారు.

విద్యావేత్త గునిశెట్టికి మానవత పురస్కారం

కడప ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకుని ప్రముఖ విద్యావేత్త, విద్యాశాఖ రిసోర్స్ పర్సన్ డా.గునిశెట్టి శ్రీనివాసులుకు ఉపాధ్యాయునిగా విద్యారంగంలోనే కాకుండా వివిధ సామాజిక రంగాల్లో ఆయన చేసిన సేవలను గుర్తించి మానవత సంస్థ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందజేశారు. మానవత ప్రతినిధులు అవటాల రామాంజులు రెడ్డి, రాటాల గోపీ, సాంబశివా రెడ్డి, సుబ్బరాయుడు, వైవీయూ డా.మధుసూదన రెడ్డి, సుబ్రమణ్యం, డా.నీలవేణి తదితరులు ఆయనను సన్మానించారు. ఈసందర్భంగా ఆయన పనిచేస్తున్న ఎగువపల్లి జడ్పీ హైస్కూల్ హెడ్మాస్టర్, సహచర ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న మానవత సంస్థ ప్రతినిధులు



ఉపాధ్యాయురాలు పద్మజారాణిని సన్మానిస్తున్న కేంద్రీయ విద్యాలయ సిబ్బంది



పదవీ విరమణ ఉపాధ్యాయులను సన్మానించిన పెన్షనర్ల సంఘ నాయకులు



ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించిన జేవీవీ నాయకులు



రిటైర్ డిప్యూటి ఈఓ జిలానీబాషను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న నిర్వాహకులు

క్లుప్తంగా

మహిళల రక్షణకు 'శక్తి' యాప్



శక్తి యాప్‌పై అవగాహన కల్పిస్తున్న రిమ్స్ ఎస్‌ఐ సుభాష్ చంద్రబోస్

కడప అర్బన్: మహిళలు, బాలికల భద్రత కోసం పోలీస్ శాఖ ప్రత్యేకంగా రూపొందించిన 'శక్తి' యాప్‌ను ఉపయోగించుకుని తక్షణమే పోలీసుల సహాయం పొందాలని రిమ్స్ ఎస్.ఐ సుభాష్ చంద్రబోస్ సూచించారు. నగరవనం వద్ద సందర్శకులకు యాప్ గురించి ఆయన అవగాహన కల్పించారు. డయల్ 112, చైల్డ్ లైన్ 1098, గృహ హింస 181, మహిళల వేధింపులు 1091, సైబర్ టోల్ ఫ్రీ 1930, సైబర్ మిత్ర తదితర సేవల గురించి వివరించారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, డ్రైవింగ్ లో సెల్ ఫోన్ మాట్లాడటం ప్రమాదకరమని హెచ్చరించారు.

మెడికల్ కాలేజీని ప్రభుత్వ రంగంలోనే నిర్వహించాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: రాష్ట్రంలో కొత్త మెడికల్ కాలేజీలకు సంబంధించి కూడా ఏపీ మంత్రివర్గం తీసుకున్న పిపిపి (ప్రభుత్వ–ప్రైవేటు భాగస్వామ్యం) నిర్ణయాన్ని మేము పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని సీపీఐ కడప జిల్లా కార్యదర్శి గాలి చంద్ర అన్నారు . గురువారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రాష్ట్రంలో దాదాపు 17 మెడికల్ కాలేజీల నిర్మాణాన్ని మొదలుపెట్టారని, అందులో పులివెందుల మెడికల్ కాలేజ్ ఒకటన్నారు. కూటమి ప్రభుత్వం కేవలం రాజకీయ కక్ష సాధింపు ధోరణితో మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా పులివెందుల మెడికల్ కాలేజీ కి కేటాయించిన 50 ఎంబిబిఎస్ సీట్లు రద్దు చేయమని అక్కడ భవనాలు పూర్తికాలేదు కనీస సౌకర్యాలు లేవని చెప్పడం దారుణమన్నారు.

ప్రైవేటీకరణను వెనక్కు తీసుకోవాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: ప్రభుత్వ వైద్య కళాశాలలను, ఆరోగ్య సంరక్షణ సేవలను ప్రైవేటీకరించాలని రాష్ట్ర మంత్రివర్గం చేసిన ప్రతిపాదనలను ప్రభుత్వం వెంటనే వెనక్కు తీసుకోవాలని సీపీఎం కడప నగర కార్యదర్శి రామమోహన్ డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కొత్తగా మంజూరైన వైద్య కళాశాలల నిర్మాణాన్ని, నిర్వహణను ప్రభుత్వం ఆధ్వర్యంలోనే చేపట్టాలని డిమాండ్ చేశారు. పులివెందుల మెడికల్ కాలేజీలో 50 సీట్లు భర్తీ చేసేందుకు గత ఏడాది ఎన్‌ఎంసి అనుమతులు ఇచ్చినా కూటమి ప్రభుత్వం తిరస్కరించడం చేతకానితనానికి నిదర్శనమన్నారు. వైద్య విద్యను అభ్యసించే విద్యార్థుల అవసరాలకు తగినట్లుగా వైద్య కళాశాలల్లో సీట్లు పెంచేందుకు జాతీయ వైద్య మండలిపై ఒత్తిడి తేవాలన్నారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు దస్తగిరిరెడ్డి, నగర కమిటీ సభ్యులు చంద్రారెడ్డి, పార్టీ నాయకులు రామకృష్ణారెడ్డి, నరసింహ పాల్గొన్నారు.

అన్నదానం



అన్నదానం చేస్తున్న బాలాజీ కాంప్లెక్స్ మిత్ర బృందం ప్రతినిధులు



రమేష్ హోల్ వీధిలో అన్నదానం చేస్తున్న అమీన్ హాస్పిటల్ అధినేత నయీమ్

కడప సెవెన్‌రోడ్స్ : మిలాద్ ఉన్ నబీ వేడుకను పురస్కరించుకుని శుక్రవారం కడప నగరంలో అమీన్ ఆస్పత్రి ఆధ్వర్యంలో బార్మీ అన్నదానం నిర్వహించారు. ఆస్పత్రి చైర్మన్ నయీమ్ మాట్లాడుతూ మహా ప్రవక్త జన్మదిన సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించడం సంతోషదాయకంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నగర ప్రముఖులు గోవర్ధన్‌రెడ్డి, చలపతి, ఆజం, అన్ను, కార్పొరేటర్లు అలీ అక్బర్, షంషీర్, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

బాలాజీ కాంప్లెక్స్‌లో...

మిలాదున్నబీ సందర్భంగా కడప నగరంలోని బాలాజీ కాంప్లెక్స్ మిత్ర బృందం ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్ ఖాలిక్, సత్తార్, నాసిర్, యూసుఫ్ అలీఖాన్, సర్వర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

గాంధీ బొమ్మ సర్కిల్‌లో..

కడప ఎడ్యుకేషన్: కడప నగరం ట్రంక్ రోడ్ లోని రెండవ గాంధీ బొమ్మ సర్కిల్ దగ్గర మిలాదున్ నబి మాసోత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం మౌలానా ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు షేక్ అబ్దుల్ షబ్బీర్ ఆధ్వర్యంలో ఘనంగా బార్మీ అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు.

టీడీపీలో దళిత, బడుగు బలహీన వర్గాలకు చోటు లేదు

కడప కార్పొరేషన్: తెలుగుదేశం పార్టీలో దళిత, బడుగు బలహీన వర్గాలకు చోటు లేదని ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు మాజీ చైర్మెన్ పులి సునీల్ కుమార్ అన్నారు. శుక్రవారం ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు.అట్టడుగున ఉన్న దళిత, బడుగు,బలహీన వర్గాలను అధికారానికి దగ్గర చేసేందుకు ఆనాడు నందమూరి తారకరామారావు తెలుగుదేశం పార్టీని స్థాపించారన్నారు. అనతి కాలంలోనే ఆ పార్టీని చంద్రబాబు కైవసం చేసుకున్నారని, అప్పటి నుంచి అగ్రవర్ణాల వారికే ఆ పార్టీలోగానీ, ప్రభుత్వంలోగానీ పదవులు దక్కుతూ వస్తున్నాయన్నారు. జాతీయ పార్టీ అయిన కాంగ్రెస్ నగర అధ్యక్ష పదవిని ఎస్సీలకు కేటాయించిందని, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కూడా వరుసగా నగర అధ్యక్షులుగా ఎస్సీలకు అవకాశం ఇచ్చిందన్నారు. కానీ టీడీపీ ఆవిర్భవించినప్పటి నుంచి నగర అధ్యక్ష పదవి ఎస్సీలకు ఇవ్వకపోవడం దారుణమన్నారు. నగర జనాభాలో అత్యధిక శాతంగా ఉన్న ఎస్సీలకు నగర అధ్యక్షులుగా పని చేసే సామర్థ్యం లేదా...ఎస్సీలు ఆ పార్టీకి అవసరం లేదా అనేది తేల్చి చెప్పాల్సిన అవసరం వచ్చిందన్నారు. గతంలో ఎంతోమంది ఎస్సీ నాయకులు నగర అధ్యక్ష పదవికి పోటీ పడినా దక్కలేదని, ఇప్పుడు కూడా అదే పునరావృతమైందన్నారు. టీడీపీలో దళితులు, అణగారిన వర్గాలకు మేలు జరగదని తెలిపారు. ఆ పార్టీలో ఉన్న వారు ఇప్పటికైనా పునరాలోచన చేయాలన్నారు.

8న యూరియా కొరత తీర్చాలని ఆందోళన

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: రాష్ట్రంలో ఎరువుల కొరత, యూరియా అందుబాటులో లేకపోవడం వల్ల రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, యూరియా కొరతపై సీపీఐ, రైతు సంఘం ఈనెల 8న తలపెట్టిన ఆందోళన జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని పాతెంపల్లిలో రైతులతో సమావేశం నిర్వహించి కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతేడాది ఇదే సీజన్లో ఎటువంటి యూరియా కొరత సమస్య రాలేదన్నారు. ఈ సంవత్సరం మాత్రమే యూరియా సమస్య తీవ్రంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం యూరియా నిలువలు ఉన్నాయని చెబుతున్నప్పటికీ రైతులకు అందడం లేదన్నారు. కేంద్ర నుంచి వచ్చిన యూరియాను 80 శాతం ప్రైవేట్ ఫెర్టిలైజర్ షాపులకు తరలిస్తున్నారన్నారని ఆరోపించారు. 20శాతం మాత్రమే రైతు సేవా కేంద్రాలకు, ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు సరఫరా చేస్తున్నారన్నారు. ఈ యూరియాను కూడా స్థానిక కూటమి నాయకులు అవసరానికి మించి తీసుకుపోతున్నారనే ఆరోపణలు ఉన్నాయన్నారు.

ఈ కార్యక్రమంలో సీపీఐ నగర సహాయ కార్యదర్శి యు మద్దిలేటి, పి మల్లికార్జున, ఎస్ శివ శంకర్ రెడ్డి, పి చంద్రశేఖర్ రెడ్డి, పోలయ్య, చెన్నయ్య, టేకురు వెంకటరమణ, కొండయ్య, పకీరప్ప, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం

కడప అర్బన్: డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా 'డ్రగ్స్ వద్దు బ్రో' అనే నినాదంతో నగరంలోని ప్రకాష్ నగర్ లో ఉన్న ప్రభుత్వ ఎస్.సి బాలుర హాస్టల్ ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు శుక్రవారం రాత్రి ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. చిన్నచౌకు ఎస్.ఐ రాజరాజేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు డ్రగ్స్ వలన కలిగే అనర్థాలను వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వం డ్రగ్స్ కట్టడికి ఏర్పాటు చేసిన 'ఈగల్' టాస్క్ ఫోర్స్ గురించి ఎస్.ఐ రాజరాజేశ్వర రెడ్డి వివరించారు. ఈగల్ బృందాలు డ్రగ్స్ అక్రమ రవాణా, విక్రయాలపై ఎలా నిఘా ఉంచుతాయో తెలిపారు. డ్రగ్స్ దందాకు పాల్పడిన వారికి ఎలాంటి జైలు శిక్షలు, జరిమానాలు ఎదురవుతాయో వివరించారు.

ప్రజలు భాగస్వాములు కావాలి:

'ప్రతి పౌరుడూ డ్రగ్స్ వ్యతిరేక పోరాటంలో ఒక సైనికుడే' అని ఎస్.ఐ రాజరాజేశ్వర రెడ్డి పేర్కొన్నారు. మీ చుట్టుపక్కల ఎక్కడైనా గంజాయి లేదా ఇతర డ్రగ్స్ విక్రయాలు, వినియోగం జరుగుతున్నట్లు గమనిస్తే, వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1972కు సమాచారం ఇవ్వాలని సూచించారు.



ఈగల్ పోస్టర్‌లను ఆవిష్కరించి మాట్లాడుతున్న ఎస్‌ఐ ఎస్. రాజరాజేశ్వర్‌రెడ్డి

అంతర్జాతీయ స్థాయిలో రాణించాలి

కడప, వైఎస్‌ఆర్ సర్కిల్ : కరాటేలో అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని జిల్లా ఎస్పీ ఈజీ అశోక్ కుమార్ పేర్కొన్నారు. ఇటీవల హర్యానాలోని కురుక్షేత్ర యూనివర్సిటీలో కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా నేషనల్ ఛాంపియన్‌షిప్ 2025 నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎస్పీ కార్యాలయంలో ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జట్టు ప్రతిష్ఠాత్మకంగా పాల్గొని వివిధ విభాగాలలో మొత్తం 14 పతకాలను సాధించడం అందులో ఏడు పతకాలను కడప విద్యార్థులు సాధించడం హర్షించదగ్గ విషయం అని కొనియాడారు. విద్యార్థులను, కోచ్ విజయ్ ని ఎస్పీ అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బొజ్జ తిరుమలేష్, కోచ్ విజయ్, కోచ్ ఎన్.రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ పోటీలకు ఎంపికైన విద్యార్థులు వీరే..

అను, మేఘన, కనిష్క, యశ్వంత్ కుమార్, సోమశేఖర్ రెడ్డి, అబ్దుల్ ఖాన్, సోను, పవన్, కార్తీక్.



కరాటేలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందిస్తున్న ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్

ప్రజల, పాలసీదారుల నమ్మకాన్ని నిలుపుకుంటాం

కడప సెవెన్‌రోడ్స్ : దేశవ్యాప్తంగా ప్రజలు, కడప డివిజన్ వ్యాప్తంగా పాలసీదారులు తమపై ఉంచిన విశ్వాసాన్ని నిలుపుకుంటామని ఎల్ఐసీ సీనియర్ డివిజనల్ మేనేజర్ రవికుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక ఎల్ఐసి డివిజనల్ కార్యాలయ ఆవరణలో బీమా వారోత్సవాల ముగింపు సభలో ఆయన మాట్లాడారు. అనంతరం ఉద్యోగులకు క్విజ్, పాసింగ్ ద బాల్, అంత్యాక్షరి పోటీలను నిర్వహించి ప్రతిభ చూపిన 47 మంది ఉద్యోగులకు బహుమతులు అందజేశారు. లిటిల్ ఫ్లవర్, శివాని, ఫోకస్, గాంధీనగర్ హై స్కూల్ విద్యార్థులకు క్విజ్, వ్యాస రచన, డ్రాయింగ్ కాంపిటీషన్ పోటీలు నిర్వహించారు. ప్రభుత్వ బాలికల హై స్కూల్ విద్యార్థులకు వకృత్వ పోటీ నిర్వహించి 39 మందికి బహుమతులు అందజేశారు. మార్కెటింగ్ మేనేజర్ శ్యామ్ సుందర్ రావు ఈ సందర్భంగా బీమా వారోత్సవాల కార్యక్రమాలు జరిగిన తీరును వివరించారు. ఈ కార్యక్రమంలో సేల్స్ మేనేజర్ రామకృష్ణ, అధికారులు రాకేష్, యూనియన్ ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి పాల్గొన్నారు.



ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, ఎల్ఐసీ అధికారులు, ఉద్యోగులు

వైఎస్సార్‌సీపీతోనే బలిజలకు న్యాయం

కడప కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీతోనే బలిజ కులస్తులకు న్యాయం జరుగుతుందని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు దాసరి శివప్రసాద్, యువజన విభాగం నగర అధ్యక్షుడు గుంటి నాగేంద్ర అన్నారు. శుక్రవారం జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి బలిజలు ఆ పార్టీకి వెన్నుదన్నుగా ఉన్నారన్నారు. ఎన్టీఆర్ తర్వాత బలిజలకు ప్రాధాన్యత తగ్గుతూ వచ్చిందని, అందువల్లే చాలామంది ఆ పార్టీకి దూరమయ్యారన్నారు. చంద్రబాబు బలిజలకు వెన్నుపోటు పొడిచారని, ఎన్నో ఏళ్లుగా ఉంటున్న ఎంతో మంది సీనియర్ బలిజ నాయకులకు తీరని అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. బలిజ నాయకులు దుర్గాప్రసాద్, సుగవాసి పాలకొండ్రాయుడు, మాజీ మంత్రి బ్రహ్మయ్య, బత్యాల చెంగల్రాయుడు, బాలిశెట్టి హరిప్రసాద్ ఇలా ఎంతోమందికి అన్యాయం చేశారన్నారు. బలిజలను ఓటు బ్యాంకుగా వాడుకొని అధికారంలోకి వచ్చిన తర్వాత కరివేపాకులా పక్కన పడేస్తున్నారన్నారు. ఇప్పుడు కూడా చంద్రబాబు అదే ఆనవాయితీని కొనసాగిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు పూర్తయినా బలిజలకు ఒక్క పదవి కూడా ఇవ్వలేదన్నారు. బలిజల ఓట్లతోనే కడపలో ఎమ్మెల్యే మాధవిరెడ్డి గెలిచారన్నారు. హరిప్రసాద్‌ను కించపరిచేలా డైరెక్టర్ పదవి ఇవ్వడం అన్యాయమన్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ ఎంతో మంది బలిజ నాయకులకు కీలక పదవులు ఇచ్చిందని గుర్తు చేశారు. జిల్లాలో మాజీ మంత్రి సి. రామచంద్రయ్యకు ఎమ్మెల్సీ పదవి, సింగసాని గురుమోహన్‌కు కూడా చైర్మెన్ పదవి ఇచ్చారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎంతోమందికి కార్పొరేషన్ చైర్మెన్లు, డైరెక్టర్లు, నామినేటెడ్ పదవులు ఇచ్చారని గుర్తు చేశారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పి. క్రిష్ణమూర్తి, సుదర్శన్ రాయల్, రెడ్డి ప్రసాద్ పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ బలిజ నాయకులు

జీఎస్టీ తగ్గింపు చర్యలను స్వాగతిస్తున్నాం



మాట్లాడుతున్న వంగల శశిభూషణ్‌రెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్ : పేద వ్యాపార వర్గాలతో పాటు ఇతరులకు ఉపయోగపడేలా జీఎస్టీ తగ్గింపు విషయంలో నరేంద్రమోదీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వంగల శశిభూషణ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం కడపలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ ప్రధాని నరేంద్రమోదీ సారథ్యంలో 2013–14 సంవత్సరంలో 10వ స్థానంలో ఉన్న భారత ఆర్థిక పరిస్థితి నాల్గవ స్థానానికి చేరుకుందన్నారు. నరేంద్రమోదీ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి కట్టుబడి పాలన కొనసాగిస్తోందన్నారు. దేశ ప్రజలు 80 శాతం వినియోగించే వస్తువులపై పన్ను తగ్గించే చర్యలు చేపట్టడం దేశచరిత్రలోనే తొలిసారి అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు జంగిటి వెంకటసుబ్బారెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బొమ్మన విజయ్, జిల్లా ప్రధాన కార్యదర్శి కామినేని ప్రవీణ్ నాయుడు, పార్టీ రాష్ట్ర నాయకురాలు ఆదోని శారదమ్మ, ఓబులేసు, ఆదూరి శారదమ్మ పాల్గొన్నారు.

ఘన సత్కారం



కన్యాకుమారికి శుభాకాంక్షలు తెలియజేస్తున్న కార్మిక పరిషత్ నాయకులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీ కడప డిపో అసిస్టెంట్ మేనేజర్ నుంచి డిపో ఇన్‌ఛార్జి మేనేజర్‌గా బాధ్యతలు చేపట్టిన కన్యాకుమారికి శుక్రవారం ఏపీ పీటీడీ కార్మిక పరిషత్ నాయకులు ఘనంగా సత్కరించారు. కార్మిక పరిషత్ జిల్లా కార్యదర్శి పురుషోత్తం ఆమెకు శుభాకాంక్షలు తెలియజేసి ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా చైర్మన్ యానాదిరాజు, జిల్లా ప్రెసిడెంట్ ఏపీఎన్ రెడ్డి, డిపో అధ్యక్షులు ఆకుల కిషోర్ బాబు, కార్యదర్శి బి రాజేంద్రారెడ్డి, గ్యారేజీ కార్యదర్శి ఎస్.ఖాజాపీర్, జిల్లా మెకానికల్ ఇన్‌ఛార్జి కార్యదర్శి యు.చంద్రశేఖర్, శ్రీధర్, అన్నయ్య, యం. శివశంకర్,పి. జె. కుమార్, బాలమునయ్య, నాయక్ పాల్గొన్నారు.


ఆరోగ్య, జీవిత బీమా ప్రీమియంపై జీఎస్టీ రద్దు

కడప సెవెన్‌రోడ్స్ : కేంద్రప్రభుత్వం సెప్టెంబర్ 3, 2025న జరిగిన జీఎస్టీ కౌన్సిల్ 56వ సమావేశంలో వ్యక్తిగత ఆరోగ్య, జీవిత బీమా పాలసీలపై 18 శాతం జీఎస్టీని రద్దు చేయడం పట్ల ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం డివిజన్ ప్రధాన కార్యదర్శి రఘునాథ్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. స్థానిక ఎల్ఐసీ డివిజనల్ కార్యాలయం ఎదుట యూనియన్ నేతలు టపాసులు పేల్చి హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు అవధానం శ్రీనివాస్, అక్బర్ బాషా, రాజు, వారిజాతమ్మ, పర్వీన్, రత్న కిషోర్, చిన్నయ్య, సాదక్, శీను, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ

కడప ఎడ్యుకేషన్: కడప రిమ్స్ హాస్పిటల్ లోని రోగులకు పవిత్రమైన మిలాద్ ఉన్ నబీ మాసఉత్సవాలను పురస్కరించుకొని బ్రెడ్లు, పండ్లు, బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ కార్యక్రమాన్ని జమాతే ఇస్లామి హింద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రిమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ బి వి వెంకటరమణ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జమాతే ఇస్లామి హింద్ నగర అధ్యక్షుడు జాకీర్ హుస్సేన్, సంఘ విభాగం అధ్యక్షుడు వి ఎస్ రహమతుల్లా, సభ్యులు సాదిక్, ఖాదర్ వలీ, జీశాన్ పాల్గొన్నారు.

రిమ్స్ మార్చురీలో గుర్తు తెలియని మృతదేహం



కడప అర్బన్: కడప నగర శివార్లలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్)కి అనారోగ్యంతో గతనెల 30వ తేదీన వచ్చిన గుర్తు తెలియని వ్యక్తి (55) చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతదేహాన్ని మార్చురీలో వుంచారు. తగిన ఆధారాలతో తమను సంప్రదిస్తే మృతదేహాన్ని అప్పగిస్తామని రిమ్స్ అధికారులు పేర్కొన్నారు.

కేసు నమోదు

కడప అర్బన్: కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ స్మారక ప్రెస్ క్లబ్ వద్ద మహిళ పట్ల అసభ్య పదజాలంతో దూషించిన క్రమంలో యూట్యూబ్ ఛానెల్ రిపోర్టర్ కిషోర్‌పై కేసు నమోదు చేసినట్లు వన్ టౌన్ సీఐ రామకృష్ణ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల మేరకు.. కడప నాగరాజు పేటకు చెందిన శిరీష తన వ్యక్తిగత విషయంపై ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశానికి వెళుతుండగా, ఆమె పట్ల యూట్యూబ్ రిపోర్టర్ కిషోర్ అసభ్య పదజాలం వాడడంతో పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. ఈ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు సీఐ తెలియజేశారు.

సన్మానం

కడప ఎడ్యుకేషన్: కడప జోనల్ మలేరియా ఆఫీసర్‌గా గత నెల 31 పదవీ విరమణ చేసిన జమాల్‌బాషను శుక్రవారం కడపలోని స్వగృహంలో అల్ మేవా జిల్లా అధ్యక్షులు జలీల్ ఖాన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అల్ మేవా రాష్ట్ర చైర్మన్ డాక్టర్ ఎస్ఏఎస్ ఫరూక్ మాట్లాడుతూ కడప ప్రజలకు డాక్టర్ జమాల్ బాషా ఎన్నో సేవలందించారన్నారు. ఆయన రిటైర్ అయినప్పటికి సేవలు కొనసాగించాలన్నారు.